# చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

- ఎన్నికల వేళా జోరుగా సాగిన ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 8లక్షల టన్నుల దిగుబడులు
- రూ.1767 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్ల పూర్తి
- 1.32 లక్షల మంది రైతులకు అందిన మద్దతు ధర



నిజామాబాద్, డిసెంబర్ 9, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు చేరింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో చేతికందిన పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసింది. సాఫీగా జరిగిన ప్రక్రియతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది. 2023-24 వానకాలం సీజన్‌లో పండించిన ధాన్యాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో సేకరించారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం కొనుగోళ్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా సేకరణను ముగింపునకు తీసుకువచ్చింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 789 కొనుగోలు కేంద్రాల ద్వారా 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరి ధాన్యాన్ని సేకరించారు. సేకరించిన ధాన్యం విలువ రూ.1,767 కోట్లుగా ఉంది. వీటిలో 80 శాతం మేర చెల్లింపులు పూర్తి చేయడం విశేషం. ధాన్యం సేకరణ ద్వారా నిజామాబాద్ జిల్లాలో 62వేల మంది రైతులకు, కామారెడ్డిలో 70వేల మంది రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది. గత వానకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు టాప్‌లో నిలిచాయి. రాష్ట్రంలో అత్యధిక ధాన్యాన్ని సేకరించడంలో నిజామాబాద్ జిల్లా నంబర్ వన్ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. కామారెడ్డి టాప్ 5లో నిలిచింది. అదే ఒరవడితో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీగా ధాన్యం సేకరణ జరిగింది. ఇదిలా ఉండగా ఈసారి ప్రైవేటులో ధాన్యం కొనుగోళ్లు భారీగా జరగడం విశేషం.

**నిజామాబాద్‌లో 4.05లక్షల మెట్రిక్ టన్నులు..**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వానకాలం ధాన్యం సేకరణకు 490 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా 440 కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ద్వారా 57, పీపీసీఎస్ 374, మెప్మా 5, ఏఎంసీ 4 చొప్పున కేంద్రాలను నెలకొల్పారు. వీటిల్లో ఇప్పటి వరకు 4లక్షల 5వేల 609 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 62వేల 375 మంది రైతుల నుంచి ఈ మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రోజుకు 3వేల మెట్రిక్ టన్నుల చొప్పున వేగంగా కొనుగోళ్లను అధికార యంత్రాంగం చేపట్టింది. 1.63 కోట్ల గన్నీ సంచులు అవసరం కాగా 1.09 కోట్ల గన్నీ సంచులను అందుబాటులో పెట్టారు. 1.02కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలకు అందించారు. మొత్తం సేకరించిన 4.05లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.893.56కోట్లుగా ఉంది. సేకరించిన ధాన్యానికి గాను ఇప్పటి వరకు రూ.772.38కోట్లు చెల్లింపులను పౌరసరఫరాల సంస్థ పూర్తి చేసింది. వేగంగా ధాన్యాన్ని సేకరించడంతో పాటు అంతే వేగంగా రైతులకు ధాన్యం డబ్బులను వారి బ్యాంక్ అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో రైతులకు ఇసుమంతైనా ఇక్కట్లు తలెత్తలేదు.

**కామారెడ్డిలో 3.96లక్షల మెట్రిక్ టన్నులు..**

కామారెడ్డి జిల్లాలో గతం మాదిరిగానే ఈసారి కూడా 350 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించి 349 చోట్ల కేంద్రాలను తెరిచారు. 45 రోజులుగా ఈ కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని వేగంగా సేకరించారు. ఇప్పటివరకు సగం మేర కేంద్రాల్లో కొనుగోళ్లు ముగియడంతో మూసేశారు. మిగిలిన చోట్ల ధాన్యం సేకరణ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 70వేల 559 మంది రైతుల నుంచి 3లక్షల 96వేల 910 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. వీటి విలువ రూ.874కోట్లుగా ఉంది. ఇందులో రూ.724కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయి. మొత్తం సేకరించిన ధాన్యంలో 83శాతం మేర చెల్లింపులు పూర్తి చేశారు. 327 పీఏసీఎస్ ద్వా రా, 22 ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టారు. గతేడాది ఇదే కాలానికి 3లక్షల 98వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ యం త్రాంగం సేకరించగా ఇప్పటికే లక్ష్యానికి తగినట్లుగా ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వం నిర్దేశించిన ప్రక్రియను అనుసరించి ఆన్‌లైన్ ఆధారితంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లను చేపట్టారు. 1.20 కోట్ల గన్నీ సంచులను ఆయా కొనుగోలు కేంద్రాలకు షిఫ్ట్ చేయగా వీటిలో 99లక్షల గన్నీ సంచులను ధాన్యం తరలింపు కోసం వినియోగించారు.

## ప్రైవేటులోనూ జోరుగా..

కర్ణాటక, తమిళనాడులో తెలంగాణలో పండించిన వరి ధాన్యానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో ప్రైవేటు వ్యాపారులు చాలా మంది తెలంగాణలోని పల్లెల్లోకి చొచ్చుకొచ్చి వడ్ల కొనుగోళ్లకు ఎగబడ్డారు. భారీగా కాంటాలను ఏర్పాటు చేసి రైతుల నుంచే నేరుగా కొన్నారు. ఒక దశలో నాణ్యమైన ధాన్యం పండించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర కన్నా ఎక్కువగా రూ.2400లకు క్వింటా ధాన్యం అమ్ముడు కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఓ వైపు రైస్ మిల్లర్లు, మరోవైపు వ్యాపారులంతా పోటీ పడి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకాల ధాన్యానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు కొనుగోళ్ల కారణంగానే ఈసారి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8లక్షల మెట్రిక్ టన్నులు మేర ధాన్యమే వచ్చింది. ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం 10లక్షలకు చేరుకుంటుండగా ఈ సారి 2లక్షల మెట్రిక్ టన్నులకు పైబడిన ధాన్యం ప్రైవేటులోనే అమ్ముడైంది. అంచనాలకు మించి పండించిన వరితో పుట్లకొద్దీ ధాన్యం రాశులు అంతటా కనిపించాయి. వాతావరణం కూడా కలిసి రావడంతో భారీ దిగుబడులను రైతులు సాధించారు. మొత్తానికి కేసీఆర్ ప్రభుత్వంలో నిర్ణయించిన విధివిధానాలు, ఆన్‌లైన్ కొనుగోలు ప్రక్రియతో రైతులకు మేలు చేకూరింది. ఇకపై వచ్చే సీజన్‌లో కొత్త ప్రభుత్వంలో జరుగబోయే కొనుగోళ్ల అంశం ఏ మేరకు ఉంటుందో? ఎలాంటి విధానాలు అమలవుతాయో? వేచి చూడడం అందరి వంతుగా మిగిలింది.

# ఆందోళన వద్దు..అండగా ఉంటా..



పిట్లంలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న షిండే

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలి
- తొమ్మిదేండ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా..
- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పిట్లం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పిట్లం, డిసెంబర్ 9: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను అండగా ఉంటానని, వారి ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డుగా వేసి కాపాడుకుంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. పిట్లం మండలకేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ఐదు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఎవరూ ఆందోళన చెందవద్దని, తక్కువ ఓట్లతో ప్రజలు ఓడించారని తెలిపారు. నియోజకవర్గంలోని 130 మంది సర్పంచులు, 70 మంది ఎంపీటీసీలు, ఆరుగురు ఎంపీపీలు, ఐదుగురు జడ్పీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారేనని, రానున్న స్థానిక ఎన్నికల్లో గట్టిగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి రెండు దఫాలుగా జడ్పీ చైర్మన్ స్థానం దక్కించుకున్నామని గుర్తుచేశారు. 50 ఏండ్ల చరిత్రలో నియోజకవర్గంలో జరగని అభివృద్ధి ..బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేండ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. వంద గ్రామాలకు బీటీరోడ్లు, రహదారులపై బ్రిడ్జిలు, డబుల్ రోడ్ల నిర్మాణం, ఎంపీ బీబీపాటిల్ సహకారంతో నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ ఐదేండ్ల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేద్దామని సూచించారు. 2014 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సహకారంతో 35 వేల ఓట్ల మెజార్టీ, 2018లో 36 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వల్ప గాయం అయ్యిందని, తొందరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు అయ్యే వరకు నిద్రపోవద్దన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్‌రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల అధ్యక్షులు, ఏఎంసీ, విండో చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, విజయ్, లక్ష్మారెడ్డి, నర్సాగౌడ్, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, బాబూసింగ్, దేవేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముందున్న రోజులు మనవే...అధైర్య పడొద్దు

- స్థానిక సంస్థల్లో సత్తాచాటుదాం..
- చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక పోయాం
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమ్మేళనం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 9: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. ఓడినందుకు అధైర్యపడవద్దని.. ముందున్న రోజులు మనవేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అధికారం పోయిందని... ఏదో కోల్పోయామని బాధపడవద్దని, మన రోజులు మనకు వస్తాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యాచరణ తయారుచేసుకుందామన్నారు. గ్రూప్ రాజకీయాలను వదిలి అందరం కలిసి పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలను గెలిపించుకుంటే... మళ్లీ మనదే అధికారమని పేర్కొన్నారు. కరోనా సమయం పోగా మిగిలిన కొద్ది సమయంలోనే నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, తాడ్వాయి, గాంధారి, సదాశివనగర్, రామారెడ్డి, రాజంపేట్ మండలాల్లో ఎక్కడచూసినా అభివృద్ధి పనులను చేపట్టి మన మార్క్‌ను చూపించామని వివరించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల వద్ద చెప్పుకోలేకపోయామని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత వచ్చిన సర్వే రిపోర్టులో 70 ఏండ్లలో చేయని అభివృద్ధిని మూడేండ్లలో చేశామని, అభివృద్ధిని ప్రజల వద్ద చెప్పుకోలేకపోవడంతో ఓటమి పాలైనట్లు తెలిపారు. జెండామోసి, రాత్రనక, పగలనక తిరిగి రాత్రింబవళ్లు కష్టపడ్డ అభిమానులు, కార్యకర్తల ముఖాలు చూస్తే బాధగా ఉందన్నారు. కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తన వెంట ఉండి పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సమావేశంలో బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉషాగౌడ్, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీశ్‌కుమార్, గాంధారి జడ్పీటీసీ శంకర్ నాయక్, గాంధారి మాజీ జడ్పీటీసీ తానాజీరావ్, నాయకులు నరహరి, అంజాగౌడ్, భూంగారి రాము, నాగం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జాజాల సురేందర్